క్లుప్తంగా

కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు



నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల కోసం రూ.60 లక్షల రూసా నిధులతో కంప్యూటర్ ల్యాబ్‌ని ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.రబీన్‌కుమార్ పాఢీ తెలియజేశారు. కంప్యూటర్ ల్యాబ్‌ను గురువారం నుంచి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు.

ట్రై సైకిల్ అందజేత



విద్యార్థికి ట్రై సైకిల్ అందజేస్తున్న ఎంపీపీ శ్రీరామ్మూర్తి

టెక్కలి: నందిగాం మండలం హర్షబాడ గ్రామానికి చెందిన జొన్న హిమగిరి అనే దివ్యాంగ విద్యార్థికి ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి గురువారం ట్రై సైకిల్ అందజేశారు. తమ కుమారుడికి ట్రై సైకిల్ కావాలని గతంలో తల్లిదండ్రులు చేసిన అభ్యర్థన మేరకు దీనిని అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, ఎంఈవో నరసింహులు, పంచాయతీ కార్యదర్శి పి.ఆనందరావు, ఐఈడీ పి.రాణి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కవిటి: మండలంలో రాజపురం పంచాయతీలోని వివిధ గ్రామాలకు చెందిన 50 పేద కుటుంబాలకు రోహన్ గురుస్వామి జన్మదినం సందర్భంగా నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, దుప్పట్లు గురువారం పంపిణీ చేశారు. తొత్తిడిపుట్టుగ, మెట్టవీధి తదితర గ్రామాల నుంచి ఎంపిక చేసిన పేదలకు వీటిని అందించినట్లు వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్, పీఏసీఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొర్ర రమేష్‌లు తెలిపారు. కార్యక్రమంలో బొర్ర నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొండ చిలువ హల్‌చల్



పట్టుబడిన కొండ చిలువ

టెక్కలి రూరల్: స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి మెళియాపుట్టి వెళ్లే మార్గంలో ఉన్న కోళ్ల ఫారంలో భారీ కొండచిలువ గురువారం హల్‌చల్ చేసింది. ఫారంలోని కోళ్లను తినేందుకు సుమారు 10 అడుగుల పొడవు గల కొండచిలువ రావడం స్థానికులు గుర్తించారు. వెంటనే దానిని పట్టుకొని సమీప కొండల ప్రాంతంలో విడిచిపెట్టారు.

ఫుట్‌పాత్ సౌకర్యం కల్పించాలి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి నర్సిపురం గ్రామ ప్రజలకు పలాస రైల్వే స్టేషన్ మీదుగా రాకపోకల నిమిత్తం ఫుట్‌పాత్(నడక వంతెన) సౌకర్యం కల్పించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం రాత్రి పలాస రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన ఈస్ట్ కోస్ట్ రైల్వే ఖుర్దా డివిజన్ డీఆర్ఎం రింకేష్ రాయ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలాస రైల్వేస్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యులు డబ్బీరు భవానీశంకర్, పాట్నూరు వెంకటసతీష్, కౌన్సిలర్ గుజ్జు జోగారావు, నర్సిపురం కౌన్సిలర్ పిచ్చుకల అజయ్, పార్టీ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు బెల్లాల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ బడకల పులిరాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు చేతి కర్రలు పంపిణీ

కంచిలి: మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాన ప్రస్థాశ్రమంలో ఉన్న వృద్ధులకు కంచిలికి చెందిన వ్యాపారి గణేష్ కుమార్ అగర్వాల్ చేతికర్రలను పంపిణీ చేశారు. గురువారం ఆయన ఆశ్రమానికి విచ్చేసి, వయోభారంతో తిరిగాడుతున్న వృద్ధులకు ఎంతగానో ఉపయోగపడే పది అల్యూమినియం చేతికర్రలు, ఒక వాకర్ ను ఆశ్రమ నిర్వాహకుల ఆధ్వర్యంలో అందజేశారు.

'జయప్రదం చేయండి'

కాశీబుగ్గ: విద్యుత్ చార్జీల పెంపుదలకు నిరసనగా ఈనెల 23న కాశీబుగ్గ పాత బస్టాండ్ వద్ద జరుగు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు స్థానిక సీపీఐ న్యూ డెమోక్రసీ కార్యాలయంలో సమావేశాన్ని గురువారం నిర్వహించారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రభుత్వ బడుల్లో చిన్నారులను చేర్పించాలని ఎంఈవో తులసీరావు సూచించారు. మండలంలోని సీతాపురం, పెద్దబొడ్డపాడు పాఠశాలలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు.

బాధ్యతగా 'జగనన్న సురక్ష'

- సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి



టెక్కలి: సమీక్షలో మాట్లాడుతున్న దువ్వాడ వాణి

టెక్కలి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొస్తున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించాలని టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి సూచించారు. టెక్కలిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణపై నియోజకవర్గ స్థాయిలో అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, కో-ఆర్డినేటర్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లతో సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల రోజుల పాటు సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. దీనిలో భాగంగా మండల స్థాయిలో ప్రతిరోజూ ప్రత్యేకంగా క్యాంపులను నిర్వహించాలని సూచించారు. క్యాంపుల్లో భాగంగా కుల, ఆదాయ, జనన ధ్రువీకరణ, వివాహ ధ్రువీకరణ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్, బియ్యం కార్డు, కుటుంబాల విభజన, సీసీఆర్సీ, మ్యుటేషన్లు, ఫోన్ నంబర్‌తో ఆధార్ లింకేజీ తదితర 11 రకాల సర్టిఫికెట్లను జారీ చేసే విధంగా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజా సమస్యలపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీపీ ఎ.సరోజనమ్మ, మాజీ ఎంపీపీ ఎస్.రాఘవరావు, టి.జానకిరామయ్య, వైస్ ఎంపీపీ ఎం.కిషోర్, నాయకులు ఎస్.సత్యం, బి.హరి, జి.అప్పలరెడ్డి, కె.గోవిందరావు, ఎం.అప్పారావు, కె.సతీష్, ఎన్.భీమారావు, డి.కృష్ణారావు, బి.మోహన్‌రెడ్డి, ఎస్.రామిరెడ్డి, జె.జయరాం, టి.బలరాం, టి.పాల్గుణరావు, కె.మీనకేతనరెడ్డి, డి.రామకృష్ణారెడ్డి, కె.రామరాజు, కె.సంజీవరావు, పి.శ్రీను, ఆర్.మురళీరెడ్డి పాల్గొన్నారు.

కవిటి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనుందని ఎంపీడీవో పి.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని జగతి సచివాలయంలో సర్పంచ్ పూడి వరప్రసాద్ అధ్యక్షతన సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్ష ద్వారా చేపట్టనున్న పదకొండు అంశాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంఎల్‌వో బి.అశోక్, జేసీఎస్ మండల కన్వీనర్ జె.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని చిట్టివలస, దంత సచివాలయాల్లో వలంటీర్లు, గృహ సారథులతో మండల జేసీఎస్ ఇన్‌చార్జి గెడ్డవలస నాగభూషణరావు ఆధ్వర్యంలో జగనన్న సురక్షపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎస్వీ రమణ, గొండు చాందిని, వార్డు సభ్యులు చింతు శ్రీరాములు, చల్ల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



టెక్కలి రూరల్: బాధితుడు సంతుకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పాతటెక్కలి ఉన్నత పాఠశాలలో 1993-94లో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమతో చదువుకున్న వనమాల మంగయ్య ఇటీవల మరణించడంతో, ఆయన భార్య భారతికి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. భారతి కుటుంబ బాధ్యతలతో కష్టాల్లో ఉందని తెలుసుకున్న తోటి మిత్రులు గురువారం పాతటెక్కలిలోని ఆమె ఇంటికి సాయం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మార్పు రవికుమార్, బొడ్డ రమణమూర్తి, టి.శారద, ఎం.శ్రీను, జి.చిన్నారావు, బాలక శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: టెక్కలికి చెందిన కొర్నాపు సంతోష్ అనే వ్యక్తికి ఇటీవల అనకాపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలవ్వడంతో ప్రస్తుతం విశాఖపట్నంలో చికిత్స పొందుతున్నాడు. అయితే శస్త్ర చికిత్సకు చాలా డబ్బులు ఖర్చు అవుతాయని వైద్యులు చెప్పడంతో, ఆ యువకుడు దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. విషయం తెలుసుకున్న టెక్కలికి చెందిన అమ్మ హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు గాయపడిన యువకుడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఉదయ్‌సాగర్, నౌగాపు పండు, శరత్, రవి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నైపుణ్య కోర్సులకు దరఖాస్తులు

కాశీబుగ్గ: పలాస డాక్టర్ కణితి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజనలో స్వల్ప కాలిక కోర్సుల్లో ప్రవేశాలకు జూన్ 26వ తేదీ వరకు గడువు ఉన్నట్లు ప్రిన్సిపాల్ పైల జవహర్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఫిట్టర్ ఫాబ్రికేషన్, అసోసియేట్ ఎలక్ట్రీషియన్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. పదో తరగతి, ఆపైన పాసైన విద్యార్హత కలిగి 18-30 ఏళ్ల లోపు వయస్సు ఉన్న పురుషులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ జిరాక్స్ సెట్స్‌తో కళాశాలకు హాజరవ్వాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 63010 46329 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

జుత్తు జగన్నాయకులు జయంతి నేడు

మందస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ జుత్తు జగన్నాయకులు జయంతి కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని భేతాళపురం, నారాయణపురం, హరిపురంలో ఉన్న జుత్తు విగ్రహాల వద్ద ఉదయం 8 గంటలకు జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరవ్వాలని కోరారు.

28లోగా దరఖాస్తు చేసుకోవాలి

సోంపేట: పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో 7, 8, 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లుకు ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. జూలై 1వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. 7వ తరగతిలో 3, 8వ తరగతిలో 2, 9వ తరగతిలో 3 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు పాఠశాల వద్ద సంప్రదించాలని సూచించారు.

'గడప గడపకూ విజయవంతం చేయాలి'



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరరావు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కేశుపురం సచివాలయం పరిధిలో శుక్రవారం నుంచి నిర్వహించనున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు గ్రామ సచివాలయాన్ని గురువారం సందర్శించి సిబ్బంది, వలంటీర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను రికార్డుల్లో నమోదు చేయాలని, ఇప్పటివరకు పరిష్కరించిన సమస్యల వివరాలను పొందుపరచాలన్నారు. అనంతరం పలు రికార్డులను తనిఖీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

- డీఎల్‌పీవో రమణ



సమీక్ష నిర్వహిస్తున్న డీఎల్‌పీవో రమణ

టెక్కలి: రానున్న వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని టెక్కలి డీఎల్‌పీవో ఐ.వి.రమణ సూచించారు. స్థానిక డీఎల్‌పీవో కార్యాలయంలో టెక్కలి, పలాస డివిజన్ పరిధిలోని 17 మండలాలకు చెందిన ఈవోపీఆర్డీలు, ఈవోలతో సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా అపారిశుద్ధ్యం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్త నిల్వలు మురుగు కాలువల్లో లేకుండా చూడాలన్నారు.

స్వామిత్వ జగనన్న భూ హక్కు పథకం సర్వేను వేగవంతం చేయాలన్నారు. అలాగే మలేరియా కేసులపై అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చే వినతులను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఇంటి పన్నులు, గ్రంథాలయ సెస్ వసూళ్ల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీల వ్యవహారాలను ప్రియా సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేసేవిధంగా సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మండలాల వారీగా పంచాయతీల సమస్యలపై ఆయా అధికారుల నుంచి తెలుసుకున్నారు.

దిగుబడికి విత్తన ఎంపికే కీలకం



కాశీబుగ్గ: విత్తనాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు తదితరులు

వజ్రపుకొత్తూరు: వ్యవసాయంలో మంచి దిగుబడికి విత్తన ఎంపికే కీలకమని పాతటెక్కలి సర్పంచ్ తుంగాన సుశీల అన్నారు. గ్రామంలోని రైతులకు ఖరీఫ్ వరి విత్తనాలను ఎంపీటీసీ సభ్యుడు బాలక శ్రీను ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతు వద్దకే విత్తనాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మండల కేంద్రాల్లో విత్తనాల కోసం రైతులు క్యూ కట్టేవారని, కానీ ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే రైతులకు కావాల్సిన సామగ్రి అంతా వస్తోందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డు తీసుకుని రైతు భరోసా కేంద్రాల్లో పొందాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొల్లి జోగారావు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి దాలయ్య, వీహెచ్‌ఏ వి.ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: దేశంలో రైతుల వద్దకే విత్తనాలు చేర్చుతున్న ప్రభుత్వం కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు అన్నారు. మున్సిపాలిటీ పరిధి 7వ వార్డు చినబడం గ్రామంలో సచివాలయం వద్ద విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయ, ఆర్బీకే వ్యవస్థ ద్వారా రైతుకు కావాల్సిన అన్ని సేవలు గ్రామాల్లోనే అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దువ్వాడ రమణయ్య, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు రోణంకి శ్రీనివాసరావు, డిక్కల నిరంజన్, సంపతిరావు ధనుంజయ, వ్యవసాయ అధికారి పాపారావు, బడగల మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం పెద్దపీట



కంచిలి: దోలగోవిందపురంలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

మందస: విద్యకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కొత్తపల్లి సర్పంచ్ సేనాపతి దివ్య అన్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు ప్రోత్సాహకాలు గురువారం అందజేశారు. అలాగే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయిలో జరిగిన ఫైనాన్సియల్ లిటరసీ పరీక్ష ఫలితాల్లో ప్రథమ స్థానం పొందిన జీవన్‌సింగ్‌ఠాకూర్, పైల కీర్తనకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సవర గణేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్.ఈశ్వరరావు, పీఎంసీ చైర్‌పర్సన్ తెప్ప జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: మండలంలోని కంచిలి, డోలగోవిందపురం, ముండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో జగనన్న ఆణిముత్యాలు అవార్డులు గురువారం అందజేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్, సర్పంచ్‌లు రామచంద్రప్రధాన్, నిత్యానంద జన్ని తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నవోదయకు ఎంపిక

మందస: మండలంలోని ఉద్దానానికి చెందిన నలుగురు విద్యార్థులు నవోదయకు ఎంపికయ్యారు. ఎంపికైన కర్రి మనీష, ఆర్యామాన్, సుదీక్ష, ఉస్మంత్‌లను విజేత పాఠశాల కరస్పాండెంట్ సార మాధవరావు గురువారం అభినందనలు తెలిపారు.

పోటీ పరీక్షల్లో రాణించాలి

కంచిలి: విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రం కంచిలి ప్రాథమిక పాఠశాలలో చదివిన జాక ధీరజ్ నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడంతో, పాఠశాల హెచ్ఎం ఆర్.కామరాజు ఆధ్వర్యంలో గురువారం అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, విశ్రాంత హెచ్ఎం సాహుకారి సోమేశ్వరరావు, ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు, సర్పంచ్ లండ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని గొల్లగండి ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న యర్ర సుదీక్ష, సోంపేట పట్టణానికి చెందిన మైలపల్లి వరుణ్ ఆదిత్య నవోదయకు ఎంపిక కావడంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

విశ్రాంత ఉద్యోగుల సమావేశం రేపు

టెక్కలి: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఈనెల 24న అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఆర్.రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.ధనుంజయరావులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇన్‌కం ట్యాక్స్, ఈకేవైసీ, పాన్‌తో ఆధార్ లింక్, ఆధార్ అప్‌డేట్, ఒక ట్రెజరీ పరిధి నుంచి మరో ట్రెజరీ పరిధికి పెన్షన్ బదిలీ, సీఎఫ్ఎంఎస్‌లో సైన్ ఇన్ ఆవశ్యకత తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల పరిధిలోని విశ్రాంత ఉద్యోగులంతా ఉదయం 9:30 గంటలకు హాజరవ్వాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కవిటి: మండలంలోని రాజపురం సబ్‌స్టేషన్ పరిధి శిలగాం ఫీడర్‌లోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మండల ఇన్‌చార్జి ట్రాన్స్‌కో ఇంజినీర్ ఎం.నేతాజీ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ ఫీడర్ గ్రామాలైన శిలగాం, సహలాలపుట్టుగ, గొర్లెపాడు, ఆర్.బెలగాం, కొజ్జీరియా గ్రామ పంచాయతీల పరిధిలోని విద్యుత్ లైన్లకు అడ్డంకిగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం సబ్‌స్టేషన్ పరిధి ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, మండపల్లి, లొద్దపుట్టి గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ గోవిందరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు పనుల పరిశీలన

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 6వ వార్డు అంతరకుడ్డ గ్రామానికి మున్సిపల్ నిధులతో నిర్మితమవుతున్న రోడ్డును అధికారులు, నాయకులు గురువారం పరిశీలించారు. చినబడం నుంచి అంతరకుడ్డ వరకు పాడైపోయిన రోడ్డు తొలగించి వాటి స్థానంలో నూతన రోడ్డు నిర్మాణం చేపట్టి పరిశీలించారు. పరిశీలనలో మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, కమిషనర్ నాగేంద్రకుమార్, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, 7వ వార్డు కౌన్సిలర్ దువ్వాడ రమణయ్య, డిక్కల నిరంజన్, నాయకులు డిక్కల నిరంజన్, బడగల మధు, కాంట్రాక్టర్ మొదలవలస మన్మథరావు, ఏఈ అవినాష్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై సమీక్ష

కాశీబుగ్గ: ప్రకృతి వ్యవసాయంపై పలాస ఏడీఏ ఆఫీస్ వద్ద సిబ్బందితో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలను గుళికలుగా చేసి ఎలా తయారు చేయాలో ఎన్ఎఫ్ఏ కె.బాబాజీ వివరించారు. సీడ్ బాల్స్ తయారు చేసుకుంటే కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. కార్యక్రమంలో డివిజన్ సిబ్బంది నాగరాజు, ధనుంజయ, జయలక్ష్మి, లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి



శంకుస్థాపన చేస్తున్న పేరాడ తిలక్ తదితరులు

టెక్కలి: వైఎస్సార్‌సీపీ హయాంలో అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నామని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. నందిగాం మండలం పెంటూరు గ్రామంలో సాగునీటి కల్వర్టుకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా మండలంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, ఎంపీడీవో శివప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ కె.బాలకృష్ణారావు, ఎ.విష్ణు, చిన్ని జోగారావు, కూర్మారావు, ఎస్.బైరాగి, ఎం.సంజీవరావు, బి.గున్నయ్య, టి.దేవేంద్రరావు, బి.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాయం కోసం సరస్వతీ పుత్రుడు

- మత్స్యకార కుటుంబంలో విద్యా కుసుమం
- జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంక్
- పేదరికంతో ఐఐటీ చదువుపై సందిగ్ధత
- దాతలు సాయమందించాలని వేడుకోలు



తల్లిదండ్రులతో జేఈఈ ర్యాంకర్ కోదండరావు

కవిటి:

ప్రతిభకు పేదరికం అడ్డుకాదని.. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకున్నా ఉన్నత విద్యా సాధనలో ఉత్తమ ఫలితాలు సాధ్యమని నిరూపించాడు కవిటి మండలం కొత్తపాలెం మత్స్యకార తీర ప్రాంత గ్రామానికి చెందిన గంట కోదండరావు. తండ్రి పాపారావు చేపల వేటతో కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి లక్ష్మి వ్యవసాయ కూలీగా, చేపలు అమ్మకాలు చేస్తూ కుటుంబ పోషణలో భర్తకు సాయపడుతోంది. తమ బిడ్డ కోదండరావు స్థానిక కొత్తపాలెం పాఠశాలలో ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. అనంతరం ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివాడు. 2020లో టెన్త్ పూర్తిచేసి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి రెండేళ్లు(ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు) పూర్తి చేశాడు. చిన్నతనంలో తనకు జేఈఈపై ఎటువంటి ఆలోచన కూడా లేదు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన తర్వాత అక్కడ తన స్నేహితుల ప్రోత్సాహంతో జేఈఈ ఎంట్రన్స్ రాయాలనే ఆలోచన మొలకెత్తింది. రెండేళ్ల పాటు ట్రిపుల్ ఐటీ విజయవంతంగా పూర్తి చేశాడు. అనంతరం కార్పొరేట్ చదువుల సాయంగానీ, కోచింగ్ గానీ లేకుండా ఇటీవల జేఈఈ మెయిన్స్‌లో 98 శాతం, అడ్వాన్స్‌డ్‌లో 16,016 జాతీయస్థాయి ర్యాంక్, ఓబీసీ కోటాలో 3,977 ర్యాంకు సాధించాడు. తన స్నేహితుల అంచనా ప్రకారం భువనేశ్వర్, తిరుపతి వంటి ఐఐటీల్లో కచ్చితంగా సీటు వస్తుందని ధీమాగా ఉన్నాడు. అయితే తాను చదివేందుకు కావాల్సిన ఆర్థిక స్థోమత లేకపోవడంతో భవిష్యత్‌పై ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. ఎవరైనా దాతలు సాయమందిస్తే ఉన్నతంగా రాణించి, సమాజానికి మంచిచేసే స్థాయికి ఎదుగుతానని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు. ఐఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేయడంతో పాటు సివిల్స్ వైపు కూడా తనకు వెళ్లాలని ఉందని చెబుతున్నాడు. తమ బిడ్డ చదువు కోసం దాతలు ముందుకు రావాలని కోదండరావు తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

దాతలు సంప్రదించాల్సిన వివరాలు

గంట కోదండరావు
మొబైల్ నంబర్ : 63059 84536
బ్యాంక్ ఖాతా నంబర్ : 20453739194
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : ఎస్‌బీఐఎన్ 00002742

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- సోంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం

సోంపేట: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. పట్టణంలోని సచివాలయం-1 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వర్షంలోనూ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

స్థానికుల సమస్యలను తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. నిష్పక్షపాతంగా ప్రజలకు సేవలందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, సోంపేట సర్పంచ్ నగిరి ప్రభావతి, పార్టీ నాయకులు పొడుగు కామేష్, తోట ఢిల్లీ, గంగాదర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.